
సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 14 । జనవరి । 2024



మారుతున్న అభిరుచి

తాత.. ముత్తాతల కంచంలో నిత్యం దర్శనమిచ్చే చిరుధాన్యాలు దశాబ్దాల క్రితం కనుమరుగయ్యాయి. కానీ తిరుగుతున్న కాల చక్రంలో మళ్లీ అవే ముందుకొస్తున్నాయి. -IIలో



పోలీసులమంటూ దారి దోపిడీ

పోలీసులమని చెప్పి హైవేపై వెళుతున్న వాహనాన్ని అటకాయించి.. డ్రైవర్‌ను బెదిరించి రూ.5,000 నగదు లాక్కెళ్లిన దారి దోపిడీ నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 162 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	330	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 918.480 కిలోలు

న్యూస్‌రీల్

సన్మానం



డెమో రైలు లోకో పైలట్లను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట): నంద్యాల నుంచి కడప వరకు ఉన్న డెమోరైలును రైల్వే అధికారులు 13వ తేదీ నుంచి రేణిగుంట వరకు పొడిగించారు.దీంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇక ఇబ్బందులు ఉండవు.శనివారం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి నేతృత్వంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో డెమో రైలు పొడిగింపును స్వాగతించి రైల్వే డ్రైవర్లను పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ కరిముల్లా ఖాన్, ఏజీపీ షమీవుల్లా ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపాటి నరసింహశెట్టి, చోటానూర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



లక్ష రూపాయల విరాళం అందిస్తున్న మల్లికార్జునశ్రేష్టి కుటుంబ సభ్యులు

చక్రాయపేట: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం గండి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పులివెందులకు చెందిన మిట్టా మల్లికార్జునశ్రేష్టి తన తండ్రి మిట్టా నారాయణశ్రేష్టి, తల్లి ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, మల్లికార్జునశ్రేష్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గండి ఆలయ నూతన కమిటీ నియామకం



నూతన కమిటీ చైర్మన్ కావలి కృష్ణతేజ

వేంపల్లె/చక్రాయపేట: చక్రాయపేట మండలం మారెళ్లమడక గ్రామంలో ఉన్న గండి క్షేత్రం దేవస్థానం నూతన కమిటీ చైర్మన్‌గా వేంపల్లె మండలం ఇడుపుల పాయ గ్రామానికి చెందిన కావలి కృష్ణతేజను నియమించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ అజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాత కమిటీ పదవీకాలం గత ఏడాది డిసెంబర్‌లో పూర్తి కావడంతో ప్రభుత్వం నూతన కమిటీ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో నూతన కమిటీ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. శనివారం ఉత్తర్వులు రావడంతో ఈనెల 20వ తేదీన ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నూతన కమిటీ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. నూతన కమిటీలో సభ్యులుగా కొప్పల మునేశ్వరి, సుబ్బిరెడ్డి గారి జయమ్మ, ముద్దీ కుమారి, బుక్కే లలితమ్మ, కలమల సోమా కళావతి, బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, పబ్బతి బిందు సాగర్, బోరెడ్డి గారి వెంకట్రామిరెడ్డి, రాచినేని మధు, నారుబోయిన సుగుణమ్మ, పి.బాల వెంకటగారి కొండారెడ్డి, జి.ఈశ్వరయ్య, పి.శ్రీనివాసులరెడ్డి, ఎక్స్ అఫిసియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకులు కేసరి నియమితులయ్యారు.వీరందరూ శనివారం గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గండి క్షేత్రం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

పల్లె గూటికి పండగొచ్చింది

కష్టాలను దహించే భోగిమంటలు..భోగాలను అందించే భోగిపండ్లు..అల్లుళ్లకు స్వాగతం పలికే తోరణాలు..ధాన్యపు రాశులతో నిండిన గదులు..వీధుల్లో అందమైన రంగవల్లులు..గోపికలను సూచించే గొబ్బెమ్మలు..ఘుమఘుమలాడించే పిండివంటలు..నింగిని తాకే పతంగులు..చిందులు వేసే బసవన్నలు..సంక్రాంతి మూడురోజులు పల్లె సోయగాలు చూడతరమా అని అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి గురించి వర్ణించారు ఒక కవి. రానే వచ్చింది సంక్రాంతి.తెలుగువారు జరుపుకునే అతి పెద్ద పండుగ ఘడియలొచ్చాయి. దీంతో రైతన్నల సీమ రాయలసీమ సం'క్రాంతి'తో ప్రభవిల్లుతోంది.

- నేడు భోగభాగ్యాల భోగి
- పల్లెల్లో మొదలైన సంక్రాంతి సందడి



వైఎస్సార్ జిల్లా : కాశినాయన మండలం ఆకుల నారాయణపల్లెలో భోగిమంటలు

కడప కల్చరల్/గుర్రంకొండ/రాజంపేట టౌన్: వీధుల్లో కళ్లాపులు, రంగురంగుల రంగవల్లులతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని పల్లెలు సంక్రాంతి పండుగకు ముస్తాబయ్యాయి. ఈ పండుగ పూర్తిగా పల్లెటూరి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. తొలిరోజు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టడం, రెండోరోజు పెద్దల పండుగగా పితృదేవతలకు సమర్పణలు చేయడం, మూడోరోజు పాడిపంటలనిచ్చే పశువులకు పూజలు చేసి గ్రామ వాసుల జీవితంలో మమైకమైన వాటిని గౌరవించి ఆరాధించడం సంప్రదాయంగా వస్తోంది. తెల్లవారుజామునే భోగి స్నానాలు, ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు, హరిదాసులు, గంగిరెద్దులు, పశువుల పూజలు, కొత్త అల్లుళ్ల సందడి, ముఖ్యంగా గ్రామసీమల్లో చుట్టాలతో ఇళ్లన్నీ కొత్త కళను సంతరించుకుంటాయి.

జ్ఞాపకాల దొంతర

పెద్దపండుగ మధురమైన జ్ఞాపకాలకు నెలవవుతుంది. కాలం చెందిన కుటుంబ సభ్యుల ఫొటోలను అందంగా తీర్చిదిద్ది వాటి వద్ద దుస్తులు, వారికి ఇష్టమైన పిండివంటలు, ఆహార పదార్థాలు పెట్టి పూజలు చేస్తారు. ఈసందర్భంగా వారు బతికివున్న రోజుల్లో వారితో గడిపిన మధురమైన క్షణాలను నెమరవేసుకుంటారు.

▶▶భోగభాగ్యాల భోగి

మదనపల్లె సిటీ: సౌరమానం ప్రకారం సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించేనాడు జరుపుకునే మకర సంక్రాంతి పండుగలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. మానవాళికి, పర్యావరణానికి మేలు చేసే పండుగల్లో భోగి ఒకటి. సంక్రాంతికి ముందు రోజు జరుపుకునే పండుగ ఇది. ఆదివారం భోగిని జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దక్షిణాయనంలో చివరి రోజు ఇది. భోగి రోజున శరీరానికి నువ్వుల నూనె రాసుకుని, నలుగు పిండి పెట్టుకుని, కుంకుడు కాయల పులుసుతో తలస్నానం చేయాలి. దీంతో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సందర్భంలో శరీరంపై వచ్చే రుగ్మతలు తొలగిపోతాయి. ఆవుపేడ యాంటీసెప్టిక్‌లా పని చేస్తుంది. అందు వల్ల ధనుర్మాసంలో నెలరోజులు ఆవుపేడుతో పిడకలు చేసుకుని భోగిమంటలను వేసుకోవాలి. పిడకల వల్ల చర్మవ్యాధులు దూరమవుతాయి. వీటిని మొత్తం కాలిపోయే వరకు మంటల వద్ద ఉండి పొగను పీల్చాలి. ఇలా చేస్తే చలిపులి తెచ్చిన సమస్యలు,శ్వాసకోశ సమస్యలూ తొలగిపోతాయి. పర్యావరణానికి మేలు జరుగుతుంది.

▶▶అందమైన రంగవల్లులు



రాజంపేటటౌన్: ముగ్గులు వేస్తున్న మహిళలు

దాదాపు నెల రోజుల ముందు నుంచి ముగ్గులు సంక్రాంతికి స్వాగతం పలుకుతాయి. మధ్య చుక్కను సూర్యుడుగా, చుట్టూ ఉన్న చుక్కలు గ్రహాలుగా భావించి ప్రపంచమంతా వాటిపైనే ఆధారపడి ఉందన్న వైజ్ఞానిక సత్యాన్ని చెబుతూ చుక్కల మహిళలు ముగ్గులను తీర్చిదిద్దుతారు. ముగ్గులు వేయడంతో శారీరక వ్యాయామం చేసినట్లవుతుంది. సంవత్సరానికి ఒకసారి వచ్చే అవకాశం కనుక ఖర్చుకు వెనుకాడక ముగ్గులు తీర్చడంలో తమ కళా ప్రతిభను, నేర్పును ప్రదర్శించుకుంటారు.

▶▶హరిదాసులు



సంక్రాంతిలో వైష్ణవ ప్రధానమైన పూజలు ఎక్కువగా నిర్వహిస్తారు. అందుకే శ్రీ మహావిష్ణువు (హరి)ను స్తుతిస్తూ హరిదాసులుగానం చేస్తుంటారు. ప్రజలు వారిని ఆదరిస్తూ తమకు తోచిన సహాయం అందిస్తారు. జిల్లాలో ప్రత్యేకించి హరిదాసులు లేకపోయినా జానపద కళాకారులు, వీధి నాటక కళాకారులు, పగటి వేషాల వారు హరిదాసుల వేషంలో ఇంటింటికి వెళతారు. తంబురా వాయిస్తూ హరికీర్తనలు ఆలపిస్తారు.

▶▶గంగిరెద్దుల విన్యాసం



గుర్రంకొండ: గంగిరెద్దుతో గ్రామాలకు వస్తున్న దృశ్యం

సంక్రాంతి అంటే మనకు గుర్తుకు వచ్చేవి గంగిరెద్దుల విన్యాసాలు.ఎద్దుకు వివిధ రకాల చీరలను కప్పి అందంగా తయారు చేస్తారు. గంగిరెద్దుల వారు విన్యాసాలతో అందరినీ ఆకర్షిస్తారు.

పిల్లలకు చెప్పాలి



భోగభాగ్యాలతో భోగి పండుగ జరుపుకోవాలని పెద్దలు చెబుతుంటారు. చిన్నప్పుడు అమ్మమ్మ, అమ్మ ముగ్గులేస్తుంటే రంగులు అందించేవాళ్లం. ఇళ్ల మిద్దెలపై ఎక్కి గాలి పటాలు ఎగురవేసేవాళ్లం. మన సంప్రదాయాలు, సంస్కృతి, పండుగల గురించి పిల్లలకు తెలియజెప్పాలి. –మోహన్‌వల్లి, అధ్యాపకురాలు, మదనపల్లె

సంప్రదాయల వెనుక...



పూర్వీకులు నెలకొల్పిన సంప్రదాయాలు, సాంస్కృతిక విషయాల వెనుక సైన్స్ దాగి ఉంది. మనం జరుపుకునే పండుగల వెనుక ఆరోగ్యపరమైన జాగ్రత్తలు ఉంటాయి. అందరూ సంప్రదాయాలను గౌరవించాలి. –ఫణీంద్ర, టీచర్, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

సందడైన పండుగ



ఏతరానికైనా సంక్రాంతే సందడైన పండుగ. ఎక్కడెక్కడో ఉన్న వారంతా సంక్రాంతికి వచ్చారు. బంధువుల రాకతో అనేక మంది ఇళ్లు కళకళలాడుతున్నాయి. ఊళ్లో సంక్రాంతి సందడి చూస్తుంటే మనసు పులకించిపోతుంది. –ఏ.శంకర్‌రాజు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, రాజంపేట

మాటల్లో చెప్పలేని ఆనందం



నేను చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగకు ఇంటికి రావడం కోసం రెండు నెల క్రితమే ప్లాన్‌చేసుకున్నా. ఊళ్కోకి రాగానే సంక్రాంతి వాతావరణం స్పష్టంగా కనిపించింది. బంధువులు, చిన్ననాటి స్నేహితులు కూడా పండగకు ఊరొచ్చారు. అందరితో సరదాగా గడుపుతున్నా. ఈ ఆనందం మాటల్లో వర్ణించలేనిది. –సాయిచందురెడ్డి, హస్తవరం, రాజంపేట మండలం

కదలి..రావట్లేదు



మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

- 19న కమలాపురంలో టీడీపీ కార్యక్రమం
- విజయవంతం కోసం నేతల సమన్వయ సమావేశం
- జ్వరం సాకుతో డుమ్మా కొట్టిన టీడీపీ ఇన్‌చార్జిలు
- పుత్తా నరసింహారెడ్డి అసహనం

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో లుకలుకలు బహిర్గతమవుతున్నాయి. నియోజకవర్గ బాధ్యులకు అధినేత చంద్రబాబు పర్యటన శిరోభారంగా మారింది. ఈనెల 19న రా...కదలిరా కార్యక్రమం కమలాపురంలో నిర్వహించ తలపెట్టారు. ఏర్పాట్ల కోసం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, పొలిట్‌బ్యూరో సభ్యుడితో సహా నలుగురు ఇన్‌చార్జిలు డుమ్మా కొట్టారు. పొరుగు జిల్లాలకు చెందిన సమన్వయ నేతల ఎదుట కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఇక్కడ రద్దు చేసి కడపలో పెట్టుకోండంటూ నేతల మధ్య ఉన్న అనైక్యతను బాహాటపర్చారు.

- కమలాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రా...కదలిరా కార్యక్రమం కడప పార్లమెంట్ పరిధిలో ఏర్పాట్ల బాధ్యతను మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి అప్పగించారు. సమన్వయ కర్తలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి (నెల్లూరు), ఏరాసు ప్రతాపరెడ్డి (కర్నూల్) ఉన్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతం కోసం చర్చించేందుకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరు కావాలని ముందస్తుగా సమాచారం ఉంది. మైదుకూరు, కమలాపురం, బద్వేల్ ఇన్‌చార్జిలు పుట్టా సుధాకర్, పుత్తా నరసింహారెడ్డి, రితేష్‌రెడ్డి హాజరయ్యారు. కాగా, నలుగురు గైర్హాజర్ కావడం విశేషం. చంద్రబాబు పర్యటన అంటేనే నేతలకు శిరోభారంగా మారింది. జిల్లాలో ప్రజలను సమీకరించడం టీడీపీ నేతలకు బహుకష్టంగా మారింది. దీంతో బాధ్యతలు భుజస్కందాలపై వేసుకునేందుకు ఆయా నేతలు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

▶▶జ్వరం సాకు చూపెట్టిన నేతలు

టీడీపీ సమన్వయ కమిటీ సమావేశానికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డితోపాటు ప్రొద్దుటూరు, కడప, జమ్మలమడుగు, పులివెందుల ఇన్‌చార్జిలు వరుసగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాధవీరెడ్డి, భూపేష్‌రెడ్డి, బీటెక్ రవిలు హాజరు కాలేదు. అనంతపురం, కర్నూలు, నెల్లూరు నుంచి సమన్వయకర్తలుగా ఉన్న నేతలు హాజరైనా జిల్లాకు చెందిన వారు గైర్హాజరయ్యారు. ఫోన్‌లో వాకబు చేస్తే జ్వరం కారణంగా హాజరు కాలేదన్న సమాధానం ఆయా నేతల నుంచి వచ్చినట్లు సమాచారం. అందరికీ ఒక్కసారిగా జ్వరం వస్తుందా... కావాలనే హాజరు కాలేదని, ప్రోగ్రామ్ విఫలం చేయాలని ఉన్నారని కమలాపురం ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆయా నేతలపై ఆరోపణలకు దిగినట్లు తెలుస్తోంది. ఒకదశలో చంద్రబాబు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రమైన కడపలో పెట్టుకోవాలని సూచించినట్లు సమాచారం. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయా ఇన్‌చార్జిలతో పర్సనల్‌గా మాట్లాడుతామని పుత్తాను శాంతింపజేస్తూనే, చంద్రబాబు కార్యక్రమం విజయవంతం చేసేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు అధ్యక్షుడు లింగారెడ్డి, దేవగుడి శివనాథరెడ్డి, మైనార్టీ నేతలు అమీర్‌బాబు, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాల్లో సంక్రాంతి జరుపుకోరు



టి.పసలవాండ్లపల్లెలోని శ్రీపల్లావలమ్మతల్లి ఆలయం



సంక్రాంతి పండుగ జరుపుకోని టి.పసలవాండ్లపల్లె గ్రామాలు

- తరతరాలుగా వస్తున్న ఆచారం
- నేటికీ కొనసాగిస్తున్న గ్రామస్తులు
- గుర్రంకొండ మండలంలో 18 గ్రామాల కట్టుబాటు

గుర్రంకొండ: తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతికి మొదటిస్థానం ఉంది. పంటలు పండించడానికి సాయపడే పశువులకు భక్తితో చేసుకునే పండుగే సంక్రాంతి. ఆరుగాలం కష్టపడి పనిచేసే ప్రతిరైతూ తప్పనిసరిగా ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారు. అయితే ఇందుకు భిన్నంగా సంక్రాంతిని 18 పల్లెలు జరుపుకోని సంఘటన గుర్రంకొండ మండలంలోని 18 గ్రామాల్లో చోటు చేసుకొంది. పాత కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని నేటి ఆధునిక సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సమాజంలో ఈతరం యువత కూడా ఆచరిస్తుండడం విశేషం. ఇప్పటికీ గతంలో ఎప్పుడో పెద్దలు ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లను గ్రామస్తులు కలసి కట్టుగా అమలు చేసుకొంటుండడం ఆ ఊళ్ల ప్రత్యేకత.

- సంప్రదాయాలకు, పురాతన ఆచారాలకు నిలయంగా మారుమూల టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో మొత్తం 18 గ్రామాలను చెప్పుకోవచ్చు. వీరి పురాతన ఆచారం ప్రకారం ఆయా గ్రామాల్లో ఈపండుగను జరుపుకోవడం నిషేధం. పల్లెల్లో పశువులను సింగారించడం. అందంగా అలంకరించడం , మేళతాళాలతో ఊరేగించడం వంటి దృశ్యాలు ఇక్కడ కనిపించవు. ప్రతి సంవత్సరం మార్చినెలలో నిర్వహించే గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ జాతర ఉత్సవాలే ఇక్కడి ప్రజలకు సంక్రాంతి పండుగ. గ్రామానికి చెందిన గ్రామదేవత శ్రీ పల్లావలమ్మ ఆజ్ఞానుసారం ప్రకారం ఈ పండుగ జరపకూడదంటూ పూర్వకాలంలో గ్రామపెద్దలు నిర్ణయించారు. వారి ఆదేశాలనే నేటికీ ఇక్కడ ప్రజలు పాటిస్తుండడం గమనార్హం. గ్రామంలో కొన్ని పశువులను గ్రామదేవత పల్లావలమ్మ పేరుమీద వదిలేసి కొందరు వాటిని మేపుతుంటారు. ప్రతి ఏడాది మార్చి నెలలో జాతర జరుపుతుంటారు. ఉత్సవాల రోజున అమ్మవారి పేరుమీద వదిలిన ఆవులను మాత్రమే అందంగా అలంకరించి.. వాటిని ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. అక్కడ వాటికి భక్తిశ్రద్ధలతో గ్రామస్తులందరూ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పాడిఆవులతో వ్యవసాయం నిషిద్ధం

సాధారణంగా రైతులు ఇప్పటికీ చాలా గ్రామాల్లో పాడిఆవులతో వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఈ 18 గ్రామాల్లో మాత్రం పాడిఆవులతో వ్యవసాయ పనులు చేయరు. గోమాతను భక్తిశ్రద్ధలతో పూజించే సంస్కృతి ఇక్కడ మాత్రమే ఉండడం విశేషం. నాగరికత వెర్రితలలు వేస్తున్న ప్రస్తుత ఆధునిక సమాజంలో కుడా పూర్వపు పెద్దల ఆచారాలను నేటి తరం యువత పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆచారాలను మరువబోం



పూర్వీకులు, పెద్దల ఆచారాలను, సంప్రదాయాలను మరవబోం. మాగ్రామదేవత శ్రీపల్లావలమ్మ ఉత్సవాల రోజున అమ్మవారి ఆవులను ఆలయం వద్దకు తీసుకొని వచ్చి పూజలు నిర్వహిస్తాం. అదేమాకు సంక్రాంతి పండుగ. అంతకు మించి ఇప్పుడు ఎలాంటి ఉత్సవాలు ఇక్కడ జరగవు. – బ్రహ్మయ్య, ఆలయపూజారి, బత్తినగారిపల్లె

సంప్రదాయాలను గౌరవిస్తున్నాం



పూర్వీకుల సంప్రదాయాన్ని గౌరవిస్తూ నేటికి వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నాం. మా ప్రాంతంలోని 18 గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోం. చిట్లాకుప్పల మంటలు ఇక్కడ కనిపించవు. పూర్వీకు ఆచారాలనే ఇప్పటికీ కొనసాగిస్తున్నాం. – కరుణాకర్, టి.గొల్లపల్లె, టి.పసలవాండ్లపల్లె పంచాయతీ.

మారుతున్న అభిరుచి



- చిరుధాన్యాలపై ఆరోగ్యాభిలాషల మక్కువ
- మళ్లీ పాతతరం ఆహారపు అలవాట్ల వైపు అడుగులు
- ఒంటికి ఇదే మంచిదంటున్న నిపుణులు

తాత.. ముత్తాతల కంచంలో నిత్యం దర్శనమిచ్చే చిరుధాన్యాలు దశాబ్దాల క్రితం కనుమరుగయ్యాయి. కానీ తిరుగుతున్న కాల చక్రంలో మళ్లీ అవే ముందుకొస్తున్నాయి. ఫ్యాషన్ పోకడలతో దూరం చేసుకున్న పాత వంటకాలే.. మన ఒంటికి శ్రేయస్కరమని మళ్లీ స్వాగతం పలకాల్సిన రోజులు రానే వచ్చాయి. పిజ్జాలు, బర్గర్‌లు.. శాండ్‌విచ్ లాంటి ఫ్యాన్సీ ఫుడ్ నుంచి రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలు.. ఇలా అనేక రకాలైన చిరు ధాన్యాలే మనిషి ఆరోగ్యానికి శ్రీరామరక్ష అంటున్నాయి.



సాక్షి, కడప డెస్క్ : మానవ జీవితంలో 30 ఏళ్ల క్రితం దాకా సందడి చేసిన చిరు ధాన్యాలు క్రమేణా కనుమరుగయ్యాయి. అప్పటి నుంచి ఆరోగ్యం ఎంత గాడి తప్పిందో, దేహం రోగాల పుట్టగా ఎందుకు తయారైందో అర్థమయ్యాక.. జరిగిన నష్టాన్ని పూడ్చునేందుకు మళ్లీ నేటితరం పెద్దలతోపాటు కుర్రకారు సైతం వినియోగించడం ప్రారంభించింది. మనిషి ఆరోగ్యంపై పెనుప్రభావాన్ని చూపుతున్న ఆహారపు అలవాట్లను క్రమేణా మార్చుకోవాల్సిందేనని అనేక వైద్యరంగ సర్వేలు, పోషకాహార సంస్థలు హెచ్చరిస్తుండటంతో.. పాతతరపు వాటి వైపు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే మన దేశం విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్యసమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి మరీ చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోరబాలికలకు వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎనిమిది రకాల మిల్లెట్స్‌తో చేసుకునే వంటల పుస్తకాన్ని భారత మిల్లెట్స్ పరిశోధన సంస్థ తన వెబ్‌సైట్‌లో ఉంచింది. అందరిలో ఒకేసారి పూర్తి స్థాయిలో మార్పు రాకపోయినా క్రమేణా దృష్టి పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి విశేష కృషితో చిరు, సిరిధాన్యాలపై అవగాహన పెరుగుతోంది. సజ్జలు, కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, అండుకొర్రలను ఆయన సిరిధాన్యాలుగా ప్రకటించారు.

ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో..

రోజూ మనం తీసుకునే ఆహారంలో బియ్యం, గోధుమలు ఎక్కువ పాళ్లు ఉంటాయి. అయితే వీటి స్థానంలో చిరుధాన్యాలు స్వీకరించడం వల్ల అనేక విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ, లవణాలు లభిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. శరీరంలోని రక్తం వృద్ధికి, మనిషి ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపొందించుటకు, జీర్ణక్రియ వ్యవస్థను మెరుగు పర్చేందుకు, శరీరంలోని అన్ని అవయవాలను సమర్థవంతంగా పని చేయడంలో వీటి పాత్ర కీలకంగా ఉంటుందని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. చిరుధాన్యాలతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడిప్పుడే మనకు అర్థమవుతోంది. రోజూ తినే ఆహార పదార్థాలు కల్తీ కావడం, సారం లేకపోవడం, పురుగుల మందుల అవశేషాలు ఉండటంతో వాటిని తింటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే రోజూ తీసుకునే ఆహారం స్థానంలో మిల్లెట్స్ చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మిల్లెట్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ–ఎరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) నిరూపించింది.

సూపర్ ఫుడ్

మిల్లెట్లలో పోషకాలు అధికంగా ఉంటాయి. అందుకే వీటిని సూపర్‌ఫుడ్ అని పిలుస్తారు. బియ్యం, గోధుమ పిండితో పోలిస్తే వీటిలో గ్లైసెమిక్ తక్కువ. అంతే కాకుండా ఫైబర్ పరిమాణం అధికంగా ఉంటుంది. వీటితోపాటు ట్రైగ్లిజరైడ్స్ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయని నిపుణులంటున్నారు.

జిల్లాలో..

జిల్లాపై కోవిడ్ తన విశ్వరూపాన్ని చూపిన తర్వాత పేద, ధనిక, ముసలి, ముతక, ఆడ మగా తేడా లేకుండా అన్ని వర్గాలపై వ్యాధుల పంజా విసిరింది. దీంతో చాలా మంది దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, స్థూలకాయంతో బాధపడుతున్న వారంతా తమ ఆయుఃప్రమాణాలను పెంచుకునేందుకు ఇప్పుడు చిరుధాన్యాల వైపు పరుగులు తీస్తున్నారు. తద్వారా ప్రస్తుతం జిల్లాలో చిరుధాన్యాల విక్రయ దుకాణాలకు మరింత డిమాండ్ పెరిగింది. అలాగే మిల్లెట్స్ వంటకాలు అందించేందుకు ప్రత్యేక కేంద్రాలు వెలిశాయి. మిల్లెట్లతో పొంగల్, ఇడ్లీ, దోశ, వడ, ఊతప్పలతోపాటు నూడుల్స్, పాస్తా తదితర ఎన్నో రకాల ఫుడ్ ఐటమ్స్ ఇప్పుడు అందుబాటులో ఉంటున్నాయి. మిల్లెట్ స్పెషల్స్ రుచి తెలిసివారు.. ప్రత్యేకంగా అవి దొరికే సెంటర్లు, రెస్టారెంట్లకు వెతుక్కుంటూ వెళుతున్నారు. పైగా రెడీ టు కుక్ ఐటమ్స్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వీటి అమ్మకాలు ఇటీవల బాగా పెరిగాయి.

అన్ని రకాలతో మేలు

మిల్లెట్స్‌లో ఒక్కో వెరైటీలో శరీరానికి అవసరమైన ఒక్కో రకమైన విటమిన్స్, మినరల్స్, యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి.. కాబట్టి అన్నింటినీ ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులంటున్నారు. ప్రాసెస్ చేసిన మిల్లెట్స్ కంటే సహజమైన తృణధాన్యాలనే తీసుకోవాలంటున్నారు. అలాగే ఆరోగ్యానికి మేలు చేస్తాయి కదా అని అతిగా తినడం అనర్థమేనంటున్నారు. ఇక మిల్లెట్స్‌ను నేరుగా కాకుండా వాటిని వండేందుకు కొద్ది గంటల ముందు నీటిలో నానబెట్టాలని, మిల్లెట్స్‌తోపాటు పప్పుధాన్యాలు, బీన్స్ వంటి ప్రోటీన్స్‌తో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మేలంటున్నారు.

సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి

చిరుధాన్యాల డిమాండ్‌కు తగిన ఉత్పత్తి జిల్లాలో లేకపోవడంతో ఇప్పుడు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వీటి సాగు పెంచేందుకు దృష్టి సారించింది. ఇతర పంటల సాగుతో పోల్చితే.. చీడ, పీడల సమస్య తక్కువగా ఉంటుందని, పర్యావరణ హితమైన పంటలు కావడం రైతులకు అనుకూల అంశాలని అధికారులు చెబుతున్నారు.

వినియోగం పెరుగుతోంది



చిరుధాన్యాలు ఎక్కువగా వినియోగిస్తే.. మెట్ట రైతులకు ఎంతో మేలు చేసిన వారం అవుతాం. ఇవి తక్కువ వర్షపాతంతోనే పండుతాయి. గతంలో రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా పండించే వారు. జనం వీటిని తినడం తగ్గించడంతో.. సాగు చేయడం తగ్గించారు. అదే బియ్యం, గోధుమలు పండించాలంటే.. నీరు ఎక్కువగా అవసరం అవుతుంది. పెద్ద, పెద్ద ప్రాజెక్టుల నుంచి కాలువలకు సాగునీరు రావాల్సి ఉంటుంది. వీటికి పట్టే ఎకరం నీటితో.. 15 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేయవచ్చు. వీటి వినియోగం మళ్లీ పెరుగుతుండటంతో.. మెట్ట భూముల రైతులకు మంచి రోజులొస్తున్నాయి.

– ప్రకృతివనం ప్రసాద్, చిరుధాన్యాల నిపుణులు

అన్ని రోగాలకు చెక్



మిల్లెట్లు షుగర్, మలబద్ధకం, మూర్ఛ, ఆస్తమా, చర్మ, ప్రోస్టేట్, థైరాయిడ్ సమస్యలను దూరం చేస్తాయి. క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తాయి. ఎముకల్లో గుజ్జు ఏర్పడుతుంది. స్పెర్మ్ కౌంట్ పెరుగుతుంది. మూలశంక, ఫిషర్స్, అల్సర్లు, మొలలు ఉన్న వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

– కల్లూరి రఘురామిరెడ్డి, పోషకాహార నిపుణులు

ఆహార ధాన్యాలకు ప్రత్యామ్నాయంగా..



మేము ఆహార విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నాం. రోజువారి ఆహార విధానంలో బియ్యం, గోధుమలకు ప్రత్యామ్నాయంగా సిరిధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికలు, రాగులు, జొన్నలు వంటి మిల్లెట్స్‌ను ఉపయోగిస్తున్నాం. దోశ, ఇడ్లీ వంటి ఆహార పదార్థాలకు బియ్యం బదులుగా సిరిధాన్యాలను తీసుకుంటున్నాం. దీనివల్ల ఆరోగ్యంతోపాటు మంచి పోషక విలువలు శరీరానికి అందుతాయి.

– డాక్టర్ జి.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

సిరిధాన్యాల ప్రాధాన్యత పెరిగింది



ప్రస్తుతం ఆరోగ్యం పట్ల అందరికీ శ్రద్ధ పెరిగింది. ఇందులో భాగంగా తీసుకునే ఆహారం పట్ల అవగాహన పెంచుకుంటున్నారు. నేను ఆహార నిపుణులైన ఖాదర్‌వలి, మంతెన సత్యనారాయణ సూచనలు పాటిస్తూ ఉన్నాను. 60 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యంగా ఉన్నామంటే తినే ఆహారమే ఎంతో కీలకం. మిల్లెట్స్‌ను వినియోగిస్తున్నాం. బయట తినాల్సి వచ్చినా కూడా ప్రస్తుతం హోటల్స్‌లో కూడా మిల్లెట్స్ వంటకాలు లభిస్తుండటంతో అవే తింటున్నాం.

– ఎం.వీరభద్రయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప



ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



గ్రామ వలంటీర్ వచ్చి నాకు సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకెళ్లి వారం రోజుల్లో మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తిరిగాను. జగనన్న గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి నాకు శ్రమ లేకుండా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– రేష్మా, గుండ్లచెరువు గ్రామం ఖస్బా, గాలివీడు మండలం

పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయి



రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేసింది. దీంతో పాఠశాలల రూపు రేఖలు మారాయి. దీంతోపాటు తరగతి గదులు కూడా చాలా విశాలంగా తయారయ్యాయి. అలాగే గాలి వెలుతురుతోపాటు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం, పిల్లలకు మంచినీటి సౌకర్యం కల్పించడం వంటి మౌలిక వసతులు సమకూర్చారు. దీంతో పిల్లలంతా చాలా సంతోషంగా పాఠశాలలకు వస్తున్నారు.

– లెక్కల జమాల్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, ఒంటిమిట్ట

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



అల్ఫియా మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని భవానీ నగర్‌లో నివాసం ఉండే అల్ఫియా (27) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణానికి చెందిన జిలానీకి ఇద్దరు భార్యలు. మొదటి భార్య పట్టణంలోనే మరో ప్రాంతంలో కాపురం ఉన్నారు. రెండవ భార్య అయిన అల్ఫియాతో కలిసి భవానీ నగర్‌లో కాపురం ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండవ భార్యతో కొన్ని రోజులుగా గొడవ పడుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఏమి జరిగిందో తెలియదు కానీ ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శనివారం ఉదయం వరకు ఈ సంఘటనను ఎవరూ గుర్తించకపోవడంతో.. ఆలస్యంగా పోలీసులకు సమాచారం వచ్చింది. అర్బన్ సీఐతోపాటు రూరల్ సీఐ తులశీరాం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె భర్త పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రానికి చెందిన ఓ యువతి శనివారం వేకువజామున ఇంట్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యువతి తండ్రి చాంద్‌బాషా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవీంద్రబాబు వివరాలు వెల్లడించారు. బి.కొత్తకోటలోని ఓ ప్రైవేటు కళాశాలలో సానియా(18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం ఇంట్లో పరధ్యానంతో ఉన్న ఆమెను ఎందుకమ్మా అలా ఉన్నావని తల్లిదండ్రులు ప్రశ్నించారు. పరీక్షలు బాగా రాయలేదని, ఎక్కడ ఫెయిల్ అవుతానోనని ఆందోళనగా ఉందని పేర్కొంది. దీంతో కన్నవాళ్లు ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో యువతి పెట్రోల్ పోసుకుని కేకలు పెట్టడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి నుంచి మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

కుటుంబ సమస్యలతో..

మదనపల్లె : కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోతబోలు పంచాయతీ మల్లయ్యదేవరపల్లెకు చెందిన వెంకటాద్రి కుమారుడు శేషాద్రి(22) భార్యతో గొడవపడి మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన నరసింహులు(30) సొంత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. మార్గంమధ్యలోని ఆచార్లపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం గుట్టమోటు ఆంజనేయస్వామి గుడి వద్ద రాయచోటి–మదనపల్లి ప్రధాన రహదారిలో శనివారం ఉదయం దుకాణంలోకి కారు వేగంగా వచ్చి దూసుకెళ్లింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆలయంలో పని చేసే పూజారి పాపయ్య అక్కడ దుకాణం నిర్వహిస్తుండగా.. ఆ సమయంలో ఆయన ఆలయానికి వెళ్లాడు. బెంగళూరు నుంచి దువ్వూరు వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బానుప్రకాష్ రెడ్డి కారు అదుపు తప్పి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయనకు కాలు విరగ్గా రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లు, నిందితుడితో ఎస్‌ఈబీ సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

సిద్దవటం : ఒంటిమిట్ట వైపు నుంచి కడపకు వెళుతున్న కారులో 24 కర్ణాటక మద్యం బాటిళ్లను భాకరాపేట చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు సిద్దవటం ఎస్‌ఈబీ సీఐ ఉరుకుందమ్మ, సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద ఎన్నికల విధుల్లో భాగంగా శనివారం వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. కడప చిన్నచౌక్‌కు చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ఒంటిమిట్ట వైపు నుంచి కడపకు కారులో కర్ణాటకకు చెందిన 24 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, వెంకటేష్‌ను అరెస్టు చేశామన్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.4 వేలు చేస్తాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుసి, వెంకటేష్‌ను కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో గతేడాది అక్టోబర్ 9న జరిగిన చోరీకి సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. అన్నమయ్యసర్కిల్‌లో సాధారణ వాహన తనిఖీల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో.. తంబళ్లపల్లెకు చెందిన ఎల్లుట్ల భానుప్రకాష్ పోలీసులను చూసి కంగారుగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానించిన పోలీసులు అతడిని వెంబడించి, అదుపులోకి తీసుకుని విచారించగా.. తన స్వగ్రామం తంబళ్లపల్లె అని, మదనపల్లె దొంతివీధిలో నివాసం ఉంటున్నట్లు తెలిపాడు. చెడువ్యసనాలకు బానిసై, కోర్టులో గంగమ్మ ఆలయంలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. తనపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు తెలిపాడు. నిందితుడి నుంచి రూ.25 వేల నగదు, అమ్మవారి కళ్లు, కుంకుమ భరిణెలు తదితర 45 గ్రాముల వెండి వస్తువులను స్వాధీన పరచుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా శాఖ దాడులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పరిమితికి మించి ప్రయాణికులు, సామగ్రి తరలిస్తున్న జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సంక్రాంతి నేపథ్యంలో విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు నుంచి వస్తున్న బస్సులు పరిమితికి నుంచి ప్రయాణికులను తరలిస్తున్నారనే సమాచారంతో రెండు రోజుల నుంచి దాడులు చేపట్టారు. 19 కేసులు నమోదు చేసి, రూ.2,54,680 లక్షల జరిమానా విధించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జి డీటీసీ మురళి పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన చెందిన పుల్లయ్య(64) పులివెందులకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఆటోలో ప్రయాణిస్తున్న పుల్లయ్య, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న జమ్మలమడుగు చెందిన అన్వర్ అనే వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వస్తుండగా మార్గంమధ్యలో పుల్లయ్య మృతి చెందాడు. అన్వర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హాకీ ఏపీ రన్నరప్ 'కడప'

కడప స్పోర్ట్స్ : హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన స్టేట్ జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌లో వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీ కై వసం చేసుకుంది. తిరుపతి జట్టుతో నిర్వహించిన ఫైనల్‌మ్యాచ్‌లో కడప జట్టు హోరాహోరీగా పోరాడి 2–1తో ఓటమి చెంది రెండో స్థానంలో నిలిచింది. రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులకు రన్నరప్ ట్రోఫీ బహూకరించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారులను హాకీ కడప అసోసియేషన్ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ప్రెసిడెంట్ రవిచంద్ర, కార్యదర్శి శేఖర్‌లు అభినందించారు. కార్యక్రమంలో కోచ్ అనిల్, మేనేజర్ శౌరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులమంటూ దారి దోపిడీ



నిందితులు చరణ్‌కుమార్, అల్తాఫ్

మదనపల్లె : పోలీసులమని చెప్పి హైవేపై వెళుతున్న 407 టెంపో వాహనాన్ని అటకాయించి, డ్రైవర్‌ను బెదిరించి, అతడి నుంచి రూ.5,000 నగదు లాక్కెళ్లిన దారి దోపిడీ నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను టూటౌన్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య వెల్లడించారు. చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు గోరంట్ల సంతలో వ్యవసాయం కోసం మూడు జతల ఎద్దులను కొనుగోలు చేశారు. వాటిని తరలించేందుకు అక్కడే ఒక 407 టెంపో వాహనాన్ని బాడుగకు తీసుకుని ఎద్దులను అందులో ఎక్కించుకుని కాటిపేరికి బయలుదేరారు. ఈ క్రమంలో మదనపల్లె టౌన్ కూరాకుల వీధికి చెందిన పెళ్లకూరి చరణ్‌కుమార్, తట్టివారిపల్లె వెంకటేశ్వర డాబా వెనుక నివాసం ఉంటున్న అల్తాఫ్ అను ఇద్దరు వ్యక్తులు అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాన్ని అడ్డగించారు. తాము పోలీసులమని, ఎద్దులు ఎక్కడకు తీసుకెళుతున్నారంటూ, డ్రైవర్‌ను కిందకు దించి టెంపో కీని బలవంతంగా లాక్కున్నారు. అక్కడ నుంచి వాహనాన్ని వైఎస్సార్ నగర్ రోడ్డులోకి దాదాపు కి.మీ.కి పైగా తీసుకువెళ్లి డ్రైవర్‌ను కొట్టి రూ.50 వేలు ఇవ్వాల్సిందిగా బెదిరించారు. అతడు తన వద్ద డబ్బులు లేవని, మీకు ఎందుకు ఇవ్వాలని ఎదురుతిరగడంతో బలవంతంగా అతడి జేబులోని రూ.5 వేలు లాక్కుని పారిపోయారు. జరిగిన ఘటనపై డ్రైవర్ గంగాద్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన పెళ్లకూరి చరణ్ కుమార్, అల్తాఫ్‌లు గొల్లపల్లె క్రాస్ వద్ద ఉండగా, అరెస్ట్ చేసి, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని జ్యుడిషియల్ కస్టడీకి సబ్‌జైలుకు పంపారు.

ముగిసిన హ్యాండ్ బాల్ పోటీలు



చాంపియన్‌గా నిలిచిన వెస్ట్ గోదావరి జట్టుతో నిర్వాహకులు

రాజంపేట : జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. 45వ రాష్ట్రస్థాయి బాలికల అండర్–19 హ్యాండ్ పోటీలలో చాంపియన్‌గా వెస్ట్ గోదావరి జట్టు నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ, కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఈ జట్లకు జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. అసోసియేషన్ చైర్మన్ పసుపులేటి వీరప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి పవన్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజినేయులు, టెక్నికల్ కమిటీ చైర్మన్ చంద్రశేఖరరావు, రిఫ్రీస్ బోర్డు చైర్మన్ సురేష్ నేతృత్వంలో పోటీలు జరిగాయి. వెస్ట్‌గోదావరి జట్టు ఈ నెల 27 నుంచి 31 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొననుంది. కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత కొండూరు శరత్‌కుమార్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, సిగజయరాం, శ్రీనిధి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



కారుతోపాటు ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతోపాటు రూ.9 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి తెలిపారు. సుండుపల్లె వైపు నుంచి తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తున్నారని సమాచారం రావడంతో శనివారం తెల్లవారుజామున కలకడ, గుర్రంకొండ మార్గంలో అటవీ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సుండుపల్లె వైపు నుంచి వేగంగా వెళ్తున్న వాహనాన్ని సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా మహల్ – పాపిరెడ్డిగారిపల్లె మార్గంలో వెళ్తుండగా అటవీ సిబ్బంది తమ వాహనంలో వెంబడించారు. మంగళపల్లె నాగిరెడ్డికుంట వద్ద రోడ్డు పక్కన కారును ఆపి డ్రైవర్ చీకటిలో పరారయ్యాడు. వాహనాన్ని పరిశీలించగా 180 కేజీల బరువు గల 6 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, అటవీ సిబ్బంది జె.ప్రతాప్, ప్రభుతేజ, చరణ్, వెంకటేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.